# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 365 | పేజీలు: 5 | వెల: రూ.4/- | మంగళవారం 19 ఆగస్టు 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## ప్రాజెక్టులకు జలకళ

భారీ వర్షాలకు తోడు ఎగవ నుంచి వస్తున్న వరదతో నిజామబాద్ జిల్లాలోని శ్రీరామ్‌సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో 8 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.



## జూరాలకు పోటెత్తిన వరద

### 30 గేట్లు ఎత్తివేత

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18(నమస్తే ఉదయం) జూరాల జలాశయానికి సోమవారం వరద పోటెత్తింది. గత రెండు రోజులుగా జూరాల ఎగువ ప్రాంతాన కురుస్తున్న వర్షాలకు తోడు కర్ణాటక జలాశయాల నుంచి భారీగా వరద నీరు విడుదల చేయడంతో సోమవారం మధ్యాహ్నానికి జూరాల జలాశయానికి 1,95,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. వరద రాకను దృష్టిలో పెట్టుకుని వరద ప్రాజెక్టు నియంత్రణ అధికారులు ఎప్పటికప్పుడు వరద నీటి నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. జూరాల 30 గేట్లు ఎత్తివేసి 2,08,530 క్యూసెక్కులను దిగువకు, విద్యుదుత్పత్తి కేంద్రాలకు 29,707 క్యూసెక్కులను విడుదల చేశారు. డ్యాం పూర్తిస్థాయి సామర్థ్యం 9.657టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.512 టీఎంసీల నిల్వ ఉన్నాయి.

## మత ప్రాతిపదికన

# రిజర్వేషన్లు ఇవ్వడం లేదు

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు
- కేసీఆర్ చేసిన చట్టమే అడ్డంకి
- బీసీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు ఇదో సాకు
- రాహుల్‌తో రాజకీయ వైరం ఉంటే తేల్చుకోండి
- బీసీ రిజర్వేషన్లు మాత్రం అడ్డుకోవడం సరికాదు
- సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి శంకుస్థాపనలో సీఎం



హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే ఉదయం)

బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ నిరూపించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా జరిగిన పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్ సమీపంలో సీఎం ఆయన విగ్రహానికి శంకుస్థాపన చేశారు. పాపన్నగౌడ్ విగ్రహం తెలంగాణ సమాజానికి ఆదర్శంగా నిలబడాలని అభిలాషించారు. పాపన్నగౌడ్ కోటను గత ప్రభుత్వాలు మైనింగ్ లీజులకు ఇచ్చాయని, గతంలో ఖిలాషాపూర్ కోటను కాలగర్భంలో కలపాలని కొంతమంది చూశారని ఆక్షేపించారు. పాపన్న గౌడ్ చరిత్ర, స్ఫూర్తి, కోటను చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్న సీఎం రేవంత్ రెడ్డి, భవిష్యత్తు తరాలు గర్వించేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నట్లు

..మిగతా 2లో

## ప్రధానితో శుభాంశు భేటీ

- యాత్ర విశేషాలు పంచుకున్న శుక్లా
- రోదసిలో 18 రోజులు గడిపి భూమిపైకి తిరిగి వచ్చిన భారత వ్యోమగామి-
- వచ్చిన వెంటనే మోదీతో భేటీ-
- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో తన అనుభవాలను ప్రధానితో పంచుకున్న శుక్లా



2

## ప్రధాని మోదీతో ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ భేటీ



న్యూఢిల్లీ, ఆగస్టు 18 (నమస్తే ఉదయం)

మహారాష్ట్ర గవర్నర్, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్ ప్రధాని మోదీని కలిశారు. సోమవారం మధ్యాహ్నం దిల్లీ చేరుకున్న రాధాకృష్ణన్ ఆ వెంటనే ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. అంతకుముందు దిల్లీ విమానాశ్రయంలో ఆయనకు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, కిరణ్ రిజిజు, ప్రహ్లాద్ జోషి, భూపేంద్రయాదవ్ సహా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ థావడే స్వాగతం

..మిగతా 2లో



## ఓబుళాపురం కేసులో...

## మరోమారు సబితకు నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే ఉదయం)

మాజీ మంత్రి సబితా రెడ్డి, మాజీ ఐఏఎస్ కృపానందానికి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో వీరిద్దరిని నిర్దోషులుగా తేల్చుతూ నాంపల్లి సీబీఐ కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. ఈక్రమంలో కౌంటర్ దాఖలు చేయాలని ఉన్నత న్యాయస్థానం సబితా రెడ్డి, కృపానందాన్ని ఆదేశించింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు మే నెలలో తుది తీర్పు వెలువరించింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్,

..మిగతా 2లో

# శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో విషాదం

- అర్ధరాత్రి రథానికి విద్యుత్ షాక్
- ఘటనాస్థలంలో ఐదుగురు..చికిత్స పొందుతూ ఒకరు మృతి
- ఘటనపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- 5లక్షల చొప్పన ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం
- ఘటనపై విచారం వ్యక్తం చేసిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే ఉదయం)

రామంతాపూర్ గోకులే నగర్లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు విషాదం నింపింది. ఇందులో మొత్తం ఆరురుగు దుర్మరణం చెందారు. రథానికి విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. కృష్ణాష్టమి కారణంగా ఆదివారం రాత్రి ఊరేగింపు చేపట్టారు. రథాన్ని లాగుతున్న వాహనం మరమ్మతుకు గురికావడంతో దాన్ని పక్కన నిలిపివేశారు. అనంతరం యువకులు రథాన్ని చేతులతో లాగుతూ ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో రథానికి విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో రథం లాగుతున్న తొమ్మిది మందిలో ఐదుగురు అక్కడిక్కకడే మృతిచెందగా.. నలుగురు తీవ్రగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇందులో ఒకరు చికిత్స పొందుతూ మృతిం చెందారు. ఈ ఘటనతో రామంతపూర్‌లో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైన స్థానికులు వెంటనే తేరుకొని ప్రాథమిక చికిత్స చేపట్టి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఐదుగురు మృతిచెందినట్లు- వైద్యులు ధ్రువీకరించారు. మరో నలుగురిని స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మృతిచెందిన వారిలో కృష్ణయాదవ్ (21), సురేశ్ యాదవ్(34), శ్రీకాంత్‌రెడ్డి(35), రుద్రవికాస్(39), రాజేంద్రరెడ్డి(45)తో

..మిగతా 2లో



## సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విపక్షాల అభిశంసన తీర్మానం

న్యూఢిల్లీ, ఆగస్టు 18 (నమస్తే ఉదయం)

ఓట్ల చోరీ జరిగిందని కొద్దిరోజులుగా తీవ్రంగా ఆరోపిస్తున్న విపక్షాలు, ఇప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అభిశంసనకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అందుకు సంబంధించి నోటీసును తీసుకువచ్చేందుకు ఇప్పుడు ప్రతిపక్ష సభ్యులు యోచన చేస్తున్నారని సమాచారం. ఆ వ్యవహారంపై ఇప్పటికే కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ, రాజ్యసభ ఎంపీ సయ్యద్ నసీర్ హుస్సేన్ మీడియాతో మాట్లాడారు. జ్ఞానేశ్‌కుమార్‌పై అభిశంసన విషయంపై తాము త్వరలో నిర్ణయం తీసుకుటామని ఇమ్రాన్ ప్రతాప్ గఢీ తెలిపారు. అన్ని ప్రజాస్వామ్య సాధనాలను ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నామని నసీర్ హుస్సేన్ తెలిపారు. అవసరమైతే అభిశంసన తీర్మానం తీసుకొస్తామని ఇచ్చారు. అయితే ఇప్పటివరకు అధికారిక చర్చలు జరగలేదని తెలుస్తోంది. అదే సమయంలో సీఈసీని తొలగించాలంటే పార్లమెంట్ ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మెజార్టీ అవసరం. అయితే ప్రతిపక్షాలకు పార్లమెంట్‌లో అంతమంది సభ్యులు లేరు. మరోవైపు, ఓట్లో చోరీ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బిహార్‌లో యాత్ర మొదలుపెట్టిన నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ ఆదివారం ప్రెస్ మీట్ నిర్వహించారు ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్‌సింగ్ సంధు, వివేక్‌జోషీతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాహుల్ ఆరోపణలకు కౌంటర్ ఇచ్చారు. చేసిన ఆరోపణలపై

..మిగతా 2లో



# మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడం లేదు

మొదటి పేజీ తరువాయి...

వెల్లడించారు. గాంధీ కుటుంబం దేశానికి గొప్ప వరమని, శాంతితో యుద్ధాన్ని గెలవవచ్చు అని ఆయన నిరూపించారని అన్నారు. విద్య, ఉద్యోగాల్లో బహుజనులు ఆర్థికంగా ఎదగాలనేది రాహుల్ గాంధీ విధానమని, ఆయన పాలసీని అమలు చేయడమే తన బాధ్యత అని అన్నారు. రాహుల్‌గాంధీ సూచనను నూరు శాతం అమలు చేస్తామని, ఆ క్రమంలో సమస్యలు వస్తే పోరాటంలో ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

అసెంబ్లీ సాక్షిగా సవాల్ విసిరాం : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని గతంలో రాహుల్‌గాంధీ మాట ఇచ్చారని, గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనమే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కులగణన సర్వే చేశామన్న సీఎం, కులగణన సర్వేలో తప్పులుంటే చూపాలని రాజకీయ పార్టీలకు సవాల్ విసిరినట్లు తెలిపారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు అసెంబ్లీ సాక్షిగా సవాల్ విసిరామని, తప్పులు చూపితే క్షమాపణ చెబుతామని చెప్పినట్లు వెల్లడించారు. "దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కులగణన సర్వే చేశాం. కులగణన సర్వేలో తప్పులుంటే చూపాలని రాజకీయ పార్టీలకు సవాల్ విసిరాం. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు శాసనసభ వేదికగా సవాల్ విసిరాం. తప్పులు చూపితే క్షమాపణ చెబుతామని చెప్పాం" -సీఎం రేవంత్ రెడ్డి

రాజకీయ ప్రయోజనాల కోసం కులగణనను



తప్పుపట్టవద్దన్న రేవంత్, కులగణను తప్పుపడితే వందేళ్ల వరకు బహుజనులకు న్యాయం జరగదన్నారు. ప్రతి 150 ఇళ్లకు ఎన్యుమరేటర్లను పెట్టి బ్లాక్‌గా విభజించామని, 95 వేల బ్లాకుల్లో ఇంటింటి సర్వేను 60 రోజుల్లో చేసినట్లు తెలిపారు. క్షుణ్ణంగా, లోతుగా దేశంలో ఏ ప్రభుత్వం కులగణన సమాచారం సేకరించలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 56.33 శాతం బలహీనవర్గాలు ఉన్నాయని, బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఐదు నెలలుగా పెండింగ్ పెట్టిందని విమర్శించారు. మనకు అడ్డంకిగా మారింది : బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ కలిపితే రిజర్వేషన్లు 70 శాతం వరకు చేరుతాయని, తెలంగాణలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టం చేసిందని రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. గత ప్రభుత్వం చేసిన చట్టం మనకు అడ్డంకిగా మారిందని, బీసీ రిజర్వేషన్ల కోసం జంతర్ మంతర్ వేదికగా నిరసనలు తెలిపినట్లు గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ, బీఆర్ఎస్ మద్దతు ఇవ్వలేదని, సమస్యలు పరిష్కరించే శక్తి ఉన్నా మోదీ, కిషన్‌రెడ్డిలు అడ్డుపడుతున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లలో ముస్లింలను కలిపారని తొండి వాదన చేస్తున్నారన్న ఆయన, మత ప్రాదిపదికన రిజర్వేషన్లకు తావులేదని రాజ్యాంగంలోనే ప్రొవిజన్ ఉందని అన్నారు.

బలహీన వర్గాలకు అన్యాయం : బీసీ రిజర్వేషన్లలో మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉంటే చూపాలని, అబద్ధాలతో బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గుజరాత్‌లో ముస్లింలకు బీసీ రిజర్వేషన్లను మోదీ తొలగించగలరా? ముస్లిం, వెనుకబడిన వర్గాలకు రాష్ట్రంలోనూ బీసీ రిజర్వేషన్లే ఉన్నాయని, ముస్లిం ముసుగుతో బహుజనులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రాహుల్‌గాంధీపై కోపం ఉంటే వారి మీద ప్రదర్శించాలని, ఆయనపై ఇప్పటికే చాలా కేసులు పెట్టారని అవసరమైతే మరో 4 పెట్టండని అన్నారు. రాహుల్ నమ్మిన సిద్ధాంతాన్ని దెబ్బతీయవద్దని కేంద్రాన్ని కోరుతున్నట్లు ప్రసంగాన్ని ముగించారు.

# ఎడతెరిపి లేని వర్షాలు.. జనం అతలాకుతలం

**పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు**

**స్తంభించిపోయిన రవాణ.. దెబ్బతింటున్న పంటలు**

**ధ్వంసమైన రోడ్లు.. ముసురుకు తోడైన వాయుగుండం ప్రభావం**



ఉధృత్తంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18(నమస్తే ఉదయం)అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో ఆదివారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తున్నాయి. జిల్లాలో 38.9 మి.మీటర్లు వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లా వ్యాప్తంగా వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. అనేక ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు చేరి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి జనజీవనం స్తంభించిపోయింది. మల్దకల్, గట్టు, అయిజ, రాజోలీ, ఇటిక్యాల మండలాల్లో భారీ వర్షాపాతం నమోదైంది. మరో రెండు రోజులు కుంభవృష్టి కురుస్తుందని వాతావరణ కేంద్రం తెలిపింది. రాజోలీ,అయిజ,గట్టు మండలాలో భారీ వర్షాల కారణంగా వరదలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగులు పొంగిపొర్లడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. అధిక వర్షాలతో వ్యవసాయ పనులు నిలిచిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత రెండు నెలలుగా జిల్లాలో వర్షాలు లేక పంటల సాగుకు నీరు లేక ఇబ్బందులు పడిన రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంటలకు కలుపులు పెరిగి,తెగులు వ్యాపించే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో జిల్లాలో అధికంగా పత్తి పంట సాగు చేశారు. పత్తి పంట పూత,కాయ దశలో ఉండగా అధిక వర్షాలకు కాయలు రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ముసురు వాతావరణం నెలకొంది.

**పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు**

గత పది రోజుల క్రితం కురిసిన వర్షాలకు తోడు ఆదివారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పలు మండలాలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పలుమార్గాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మానవపాడు మండల కేంద్రానికి సమీపంలోని పెద్ద వాగు వంతెన పైనుంచి నీళ్లు ప్రవహిస్తుండడంతో ఆ మార్గంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగు దాటేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలో ఉన్న చెన్ని పాడుకు సైతం రాకపోకలు నిలిచిపోయాయి. ఐజ మండలం కేంద్రం నుంచి ఉత్తనూర్, మేడికొండ గ్రామాలకు వెళ్లే రహదారులపై వాగులు ఉధృత్తంగా ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల వాగులు దాటేందుకు ట్రాక్టర్ సహాయంతో ప్రజలను అవతలి ఒడ్డుకు చేర్చాల్సిన పరిస్థితి దాపురించింది. ఐజ నుంచి మంత్రాలయం వెళ్లే పోలోని వాగు సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డు మరోసారి తెగిపోయింది. దీంతో ఉత్తనూరు మీదుగా ఐజకు రాకపోకలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని పలు మండలాలో అండర్ రైల్వే బ్రిడ్జిలలో నీళ్లు నిలవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నడుంలోతు వర్షం నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

**బెంబేలెత్తుతున్న రైతాంగం**

గత కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంటచేలు నీట మునగడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. అనేక ప్రాంతాలలో రైతులు సాగు చేసిన పత్తి చేలు వర్షపు నీటిలో మునిగిపోయాయి. అదేవిధంగా మిరప తోటలు, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి, పంట నష్టాలను అంచనావేసి ప్రభుత్వం తమను ఆదుకునేలా కృషి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**వర్షపు నీటితో అధ్వానంగా గ్రామీణ రోడ్లు**

జిల్లాలో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. చెదురుముదురు వర్షాలతో అంతంతమాత్రంగా ఉన్న రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ఎన్నో సంవత్సరాల నుంచి మరమ్మతులు నోచుకోని ఆర్అండ్ బి రోడ్లు గోతులమయంగా మారాయి. గ్రామీణ ప్రాంత రోడ్లు తాజా వర్షాలతో మరింత దారుణంగా తయారయ్యాయి. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. మరోవైపు పల్లె, పట్టణం తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పాలకులు పరిష్కరించకపోవడంతోనే రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు వాపోతున్నారు.

**మట్టితోనే మరమ్మతులు**

ఎన్నో యేండ్ల నుంచి జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో పాటు వర్షం వచ్చినప్పుడల్లా రోడ్లు గుంతల మయంగా మారి మడుగులను తలపిస్తోంది. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌక్, మేళ్లచెరువు రోడ్డు, కృష్ణవేణి చౌక్, ఐజ రోడ్డు, ఫ్లై ఓవర్ సమీపంలో ఉన్న ప్రధాన రోడ్లు గోతులమయంగా మారాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లు మరమ్మత్తులు నోచుకోకపోవడంతో అధికారుల తీరుపై పట్టణ ప్రజలు విమర్శలు గుపిస్తున్నారు. పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో చాలా చోట్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అద్వానంగా మారిన రోడ్ల సమస్యను ఆర్ అండ్ బి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కూడా అధికారులు కానీ మున్సిపల్ అధికారులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడంపై పట్టణ ప్రజలు విస్మయానికి గురి చేస్తున్నాయి. తూతూ మంత్రంగా రోడ్లపై ఏర్పడిన గోతులను మట్టితో పూడ్చి చేతులు దులుపుకుంటున్నారే కానీ పూర్తిస్థాయిలో రోడ్ల మరమ్మత్తు నోచుకోవడం లేదని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్పీ**

జిల్లాలో కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు. కరెంట్ స్తంభాలు,ఇనుప వస్తువులు, ట్రాన్స్ ఫార్మర్ల సమీపంలోకి వెళ్ళవద్దని, నీటి ప్రవాహం ఉన్నచోట ఇప్పటికే పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు.

## చిన్న అనంతగిరి శివాలయంలో శ్రావణ మాసం అఖరి సోమవారం పూజలు

బుద్వేల్, ఆగస్టు 18(నమస్తే ఉదయం) . శ్రావణ మాసం ఆఖరి సోమవారం సందర్భంగా అతా పూర్ రాంబాగ్ శ్రీ చిన్న అనంతగిరి శివాలయంలో సోమవారం గణపతి పూజ, పరమ శివునికి అభిషేకాలు, ఉమా మహేశ్వరీ అమ్మవారికి కుంకుమార్చన, గణపతి హోమం, రుద్రహోమం, నవగ్రహాల పూజలు, ఆంజనేయ స్వామీ కి పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాలతో పాటు అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. ప్రణవభక్త సమాజం అధ్యక్షుడు మోంద్ర నర్సింహ్మా ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాలలో ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, ఎస్ బీ హరినాథ్, ఎన్.మల్లారెడ్డి, మ్యాడం రామేశ్వర్ రావు, మ్యాడం మధుసూదన్, మోంద్ర ఐలయ్య, చెట్టిగారి చిన్న, ఎం.బాలసుబ్రమణ్యం, ఎస్. జయానందరెడ్డి. యు శ్రీకాంత్, మ్యాడం రాము పాల్గొన్నారు.



**హోమంలో పాల్గొన్న భక్తులు:**

గణపతి హోమంలో భక్తులు పెంటల భబిత సుదాకర్ రెడ్డి, షాబాద స్వప్న విజయ్ కుమార్, కాకులారం రాణి క్రిష్ణ దంపుతలు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలలో భక్తులు ఎస్ బి శ్రీనాథ్, ఎస్ అశోక్, సులిగె మల్లేశ్, కె. కిరణ్ చారి, సత్యనారాయణ, ఎల్ వెంకటేశ్, గౌరిగె రాజు, రావుల జగన్, చెట్టిగారి శేఖర్, కైలా రవీందర్రెడ్డి, జి.సురేందర్ రెడ్డి , జి.బల్వంత్ రెడ్డి, పుస్తకాల శేఖర్, రమేశ్, కె రాజు, సంతోష్, రఘునందన్, శ్రీకాంత్, సులిగె రమేశ్, సులిగె శ్రీనివాస్, ఇంద్రారెడ్డి, నర్సింహ్మారెడ్డిలు పాల్గొన్నారు.



శ్రావణ మాసంలో ఆఖరి సోమవారం సందర్భంగా చిన్న అనంతగిరి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

## శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో విషాదం

మొదటి పేజీ తరువాయి...

పాటు- మరొకరు ఉన్నట్లు- గుర్తించారు. వారి మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గన్‌మెన్ శ్రీనివాస్ సైతం ఉన్నట్లు సమాచారం. రామంతాపూర్ ఘనటలో మృతిచెదిన బాధితులకు ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అయితే ఈ ఘటనపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరో 100 మీటర్లలో శోభాయాత్ర ముగుస్తుందనగా ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తున్నామని.. గాయపడిన వారి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. కేబుల్ వైర్ ద్వారా కరెంట్ సరఫరా జరిగి ఈ ప్రమాదం జరిగినట్లు- అధికారులు చెబుతున్నారని అన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేశారు. దర్యాప్తు నివేదిక వచ్చాక బాధ్యుతలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రేటర్ హైదరాబద్‌లో కేబుల్ వైర్లు, కరెంటు తీగలపై స్పెషల్ డ్రైవ్ కు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. నలుగురిలో చికిత్స పొందుతూ.. ఒక వ్యక్తి మృతిచెందినట్లు- వైద్యులు వెల్లడించారు. ఉప్పల్ రామంతపూర్ గోకులే నగర్లో జరిగిన దుర్ఘటన గురించి విని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా జరిగిన ఊరేగింపులో విద్యుత్ షాక్‌తో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని తెలిపారు. ఈ విషాదంలో కృష్ణ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, సురేష్ యాదవ్, రుద్ర వికాస్, రాజేంద్ర రెడ్డిలు మరణించడం హృదయ విదారకం ఘటన అని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు- ప్రకటించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు- చెప్పుకొచ్చారు.

## ప్రధాని మోదీతో ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ భేటీ

మొదటి పేజీ తరువాయి...

పలికారు. ఎన్డీయే తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా దక్షిణాదికి చెందిన మహారాష్ట్ర గవర్నర్ చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్‌ను, ఆదివారం సాయంత్రం బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఎంపిక చేసింది. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్నికైనందుకు రాధాకృష్ణన్‌కు, మోదీ శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘకాలంగా ప్రజాసేవ, వివిధ రంగాల్లో ఆయనకున్న అనుభవం దేశాన్ని సుసంపన్నం చేస్తుందని ఆయన్ని అభినందించారు. ఎల్లప్పుడూ అదే అంకితభావంతో దేశానికి ఆయన సేవలు కొనసాగించాలని కోరారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఉపాధ్యక్షుడు జగదీప్ ధన్‌ఖడ్ అకస్మాత్తుగా రాజీనామా చేసిన తరుణంలో ఎన్‌డీఏ తదుపరి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ప్రకటించారు. ఈమేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదివారం ప్రకటించారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సహా సీనియర్ నాయకులు పాల్గొని ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా ఉపరాష్ట్రపతి ఎన్నికలు సెప్టెంబర్ 9న జరగనున్నాయి. రాజ్యాంగం ప్రకారం ఉప రాష్ట్రపతి పదవీకాలం ఐదు సంవత్సరాలు. పార్లమెంటు ఉభయ సభల ఎంపీలతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ద్వారా ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 64, 68 నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తారు. చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ 2024 జులై 31 నుంచి మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన గతంలో ఫిబ్రవరి 2023 నుంచి జులై 2024 వరకు ఝార్ండ్ గవర్నర్‌గా పనిచేశారు. మార్చి, జులై 2024 మధ్య తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించారు. అంతకుముందు కోయంబత్తూరు నుంచి రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. గతంలో ఆయన తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు.

### ఓబుళాపురం కేసులో...

## మరోమారు సబితకు నోటీసులు

మొదటి పేజీ తరువాయి...

గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్ధన్‌రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల పాటు- జైలు శిక్ష ఖరారు చేసింది. అలాగే, దోషులకు రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకు రూ.2 లక్షలు జరిమానా విధించింది. ఈ కేసులో అప్పటి గనుల శాఖ మంత్రిగా ఉన్న సబితా రెడ్డికి ఉపశమనం లభించింది. ఆమెతో పాటు అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంను సీబీఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. మరోవైపు ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నలుగురు దోషులకు తెలంగాణ హైకోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. గాలి జనార్ధనరెడ్డితో పాటు , ఆయన పీఏ అలీఖాన్, బీవీ శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్‌కు బెయిల్ ఇచ్చింది.

## సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విపక్షాల అభిశంసన తీర్మానం

మొదటి పేజీ తరువాయి...

రాహుల్ ఆధారాలనైనా సమర్పించాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆయన వద్ద ఆధారాలు ఉంటే వారం రోజుల్లో ప్రమాణపత్రం రూపంలో సంతకంతో సమర్పించాలని అల్టిమేటం జారీ చేశారు. అలా చేయకపోతే మాత్రం రాహుల్ చేసిన ఆరోపణలన్నింటినీ నిరాధారంగా పరిగణిస్తామని తేల్చిచెప్పారు. ఈసీ భుజాలపై తుపాకీ పెట్టి ఓటర్లను లక్ష్యంగా చేసుకొని రాజకీయాలు చేసేవారి ఆటలు సాగవని స్పష్టం చేశారు. ఆ తర్వాత ఈసీ ప్రెస్‌మీట్ పై రాహుల్ మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సీసీ ఫుటేజీల విషయంలో ప్రభుత్వం చట్టాన్ని ఎందుకు మార్చిందని ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్లపై ఎటువంటి కేసు నమోదు చేసేందుకు వీల్లేకుండా 2023లో చట్టం చేసిందని తెలిపారు. ప్రధాని మోదీ, అమిత్ షాలకు ఈసీ సాయం చేయడంతోపాటు ఓట్ల చోరీలో పాలుపంచుకుంటున్నందుకు ఎవరూ చర్యలు తీసుకోకూడదనే దీన్ని రూపొందించిందని ఆరోపించారు.

## సీపీ రాధాకృష్ణన్‌కు మద్దతివ్వండి

న్యూఢిల్లీ, ఆగస్టు 18 (నమస్తే ఉదయం)

ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ప్రకటించిన ఎన్‌డీఏ ఆ ఎన్నికను ఏకగ్రీవం చేయాలని భావిస్తోంది. ఎన్‌డీఏ కూటమి ఆ దిశగా ప్రయత్నాలు మ్మొదలుపెట్టింది. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఫోన్ చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మద్దతివ్వాలని ఖర్గేను రాజ్‌నాథ్ కోరినట్లు సమాచారం. రెండు సార్లు కోయంబత్తూరు నుంచి లోక్‌సభ ఎంపీగా విధులు నిర్వర్తించిన సీపీ రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని ఇప్పటికే విపక్షాలను నడ్డా కోరారు. మరోవైపు ఎన్‌డీఏ తరపున ఉపరాష్ట్రపతి ఎన్నికను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పర్యవేక్షిస్తారని తెలిసింది. పోలింగ్ ఏజెంట్‌గా పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు వ్యవహరిస్తారని సమాచారం. సీపీ రాధాకృష్ణన్ తమిళనాడకు చెందిన వ్యక్తి కావడం వల్ల ఆ రాష్ట్రంలోని అధికార డీఎంకే నుంచి మద్దతు లభిస్తుంనది బీజేపీ భావిస్తోంది. ఈ క్రమంలోనే విపక్షాలు ఎలాంటి వైఖరిని అనుసరిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు అధికార ఎన్‌డీఏ తన అభ్యర్థిగా సీపీ రాధాకృష్టన్‌ను ఎంపిక చేయండతో విపక్ష ఇండియా కూటమి నేతలు కూడా తమ అభ్యర్థిని బరిలోకి దించే అంశంపై చర్చించే అవకాశం ఉంది. సోమవారం ఉదయం 10 గంటలకు రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో కూటమి పార్లమెంటరీ పక్ష నేతలు సమావేశం కానున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇక రాజకీయేతర నేపథ్యం నుంచి వచ్చిన అభ్యర్థిని ఉమ్మడిగా బరిలోకి దించుతామని ఇండియా కూటమి నేతలు ఇప్పటికే ప్రకటించారు. ఇదిలా ఉండగా, ఉపరాష్ట్ర ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడాన్ని కూటమి నేతలు స్వాగతించారు. సుదీర్ఘ ప్రజా జీవితంలో రాధాకృష్ణన్ అంకితభావం, వినయంతో ప్రత్యేకంగా నిలిచారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పుడు నిరంతరం సమాజసేవ, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడంపైనే దృష్టిసారించారని తెలిపారు.

## ప్రధానితో శుభాంశు భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 18 (నమస్తే ఉదయం)

రోదసిలో 18 రోజులు గడిపి భూమిపైకి తిరిగి వచ్చిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సోమవారం ప్రధాని మోదీని కలిశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో తన అనుభవాలను ప్రధానితో శుభాంశు పంచుకున్నారు. ఐఎస్ఎస్ నుంచి తీసిన భూమి ఫొటోలను ప్రధాని మోదీకి చూపించి అక్కడి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా జూన్ 25 నుంచి జులై 15 వరకు శుభాంశు శుక్లా తన బృందంతో కలిసి 'ఐఎస్ఎస్' యాత్ర నిర్వహించారు. శుభాంశు అంతరిక్ష యాత్ర విజయవంతమవడంతో దానిపై లోక్‌సభలో ప్రత్యేక చర్చ నిర్వహించారు. యాక్సియం-4 మిషన్‌తో భారత రోదసి చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు వ్యోమగామి శుభాంశు శుక్లా. అంతరిక్ష యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత ఆదివారం తెల్లవారుజామున ఆయన స్వదేశానికి విచ్చేశారు.

# వినాయక నవరాత్రులు, నిమజ్జనోత్సవాలలో
# కనీస జాగ్రత్తలు తీసుకోవాలి



వినాయక మండపాల నిర్వాహకుల నుద్దేశించి మాట్లాడుతున్న రాజేంద్రనగర్ అడిషనల్ కమీషనర్ కె శ్రీనివాస్



మండపాల నిర్వాహకుల నుద్దేశించి మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్

బుద్వేల్, ఆగస్టు 18(నమస్తే ఉదయం) : రాబోయే వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల నిర్వాహకులు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ కె. శ్రీనివాస్, ఏసీపీ తుల శ్రీనివాస్ లు కోరారు. మైలార్దేవుపల్లి ఇన్స్పెక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మైలార్దేవుపల్లి ప్రజా భవన్ లో నిర్వహించిన అవగాహన కార్యక్రమం లో వారు పాల్గొని ప్రసంగించారు. వినాయక మండపాల నిర్వాహకులు తప్పని సరిగా స్థానిక పోలీసులకు మండపాలు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాల వివరాలు తెలియజేయాలన్నారు. కరెంటు కనెక్షన్ ను ప్రాపర్ గా తీసుకోవాలన్నారు. ప్రతి రోజు మండపాల వద్ద ఒకరు లేదా ఇద్దరు కాపల ఉండాలన్నారు. దీపాలు, కొవ్వొత్తులు మండపాల దగ్గర ఉండకుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల దగ్గర ఎవరైన అనుమానితులు కనిపిస్తే 100కు డయల్ చేయడం గానీ, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడు గానీ చేయాలన్నారు. రాత్రి వేళలలో భజనలు చేసే వారు పోలీసులు సూచించిన సమయానికే మైక్ లు బంద్ చేయాలన్నారు. నిమజ్జనం ఊరేగింపు లో కనీస జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితిలో నిమజ్జనం ఊరేగింపులో డీజేలు ఏర్పాటు చేయవద్దన్నారు.

### రోడ్లు బాగు చేయించాలి మండపాల నిర్వాహకులు

వినాయక చవితి, నవరాత్రులు, నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాల నేపద్యంలో బస్తీలలో రోడ్లు బాగు చేయించాలని మండపాల నిర్వాహకులు కోరారు. వర్షాలకు రోడ్లు గుంతలమయంగా తయారైనాయని, వాటిని బాగు చేయించాలన్నారు. బస్తీలలో వీధి దీపాలు వెలిగేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. కరెంటు వైర్లు వేలాడుతుంటే వాటిని బాగు చేయించాలన్నారు. విద్యుత్ వైర్లు క్రిందకు ఉన్న ప్రాంతాలలో వాటిని మీదకు ఉండేలా చూడాలన్నారు. మండపాల వద్ద ప్రతి రోజు పారిశుద్య నిర్వాహణ పనులు చేయించాలన్నారు.

## ఐటిఐ ఏర్పాటుతో యువతకు నైపుణ్య శిక్షణ: ఎమ్మెల్యే జిఎంఆర్

### నియోజకవర్గాని కి ఐటిఐ (ఏ టి సి ) మంజూరు

దేవరకద్ర, ఆగస్టు 18(ప్రధాన ఉదయం) నియోజకవర్గానికి ఐటిఐ (ఏటిసి) మంజూరు తో నిరుద్యోగ యువతకు నైపుణ్యంతో కూడిన శిక్షణ పొంది ఉపాధి పొందటానికి ఎంతో దోహదపడుతుందని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. సోమవారం దేవరకద్ర నియోజకవర్గానికి ఐటీఐ (ఏటీసీని) మంజూరు చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఇచ్చిన మాట మేరకు విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ.. ప్రపంచస్థాయి టెక్నాలజీతో ప్రారంభమవుతున్న ఏటీసీని దేవరకద్ర నియోజకవర్గానికి దేవరకద్ర ఎమ్మెల్యే. జి. మధుసూదన్ రెడ్డి మంజూరు చేయించి ఆలు పెరగని నాయకుడిగా పేరుగాంచారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీకి అనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐలకు ఏఐ టెక్నాలజీ జోడించి అధునాతన సాంకేతికతతో ఏటీసీ ( అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్)లుగా అప్గ్రేడ్ చేసింది. ఈ సందర్భంగా నేడు దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలం పల్లమరి వద్ద 45 కోట్ల రూపాయలతో ఏటీసీని మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది.అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు) రాష్ట్ర అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు తేనున్నాయని అన్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు టెక్నాలజీ పూర్తిగా మారిపోయిందని.. అన్ని రంగాల్లోనూ మార్పులు వచ్చాయని.. ఇప్పుడున్న పారిశ్రామిక అవసరాలకు తగ్గ పరిజ్ఞానాలను, ఏఐ టెక్నాలజీని యువతకు నేర్పితేనే వారికి ఉద్యోగావకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఆ లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐలను ఏటీసీ లుగా అప్గ్రేడ్ చేసిందని వెల్లడించారు.

## సబ్బండ , పీడిత ప్రజల కోసం పోరాడిన మహనీయుడు సర్వాయి పాపన్న గౌడ్

### మహజనుల ముద్దు బిడ్డ సర్వాయి పాపన్న గౌడ్

### మాజీ జెడ్పి వైస్ చైర్మన్ గుండ్రాతి వామన్ గౌడ్



సర్వాయి పాపన్న చిత్రపటానికి పుష్పాంజలు ఘటిస్తున్న నాయకులు

కొత్తకోట, ఆగస్టు 18(నమస్తే ఉదయం)సబ్బండ , పీడిత ప్రజల కోసం పోరాడిన మహనీయుడు సర్వాయి పాపన్న గౌడ్ అని వనపర్తి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గుండ్రాతి వామన్ గౌడ్ కొనియాడారు. మంగళవారం కొత్తకోట మండల కేంద్రంలో సర్దార్ పాపన్న జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ గోల్కొండ కోటపై జెండా ఎగరేసిన బహుజనుల ముద్దుబిడ్డ సర్వాయి పాపన్న అని గౌనికడి రాములు యాదవ్ బీసీ కులాల ఐక్య వేదిక కన్వీనర్ అన్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాన్య కల్లు గీత కుటుంబంలో జన్మించి నాటి మొఘల్ చక్రవర్తుల వెన్నులో వణుకు పుట్టించిన అసామాన్యుడు మన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. ఆనాటి మొఘల్ చక్రవర్తుల నిరంకుశ పాలనను, స్థానిక జమిందారులు, జాగీర్ దారులు, దేశ్ ముఖ్లు, భూస్వా ముల దోపిడీని, దౌర్జన్యాలను ఎదిరించాడన్నారు. ఒక్కనితో ప్రారంభమైన సర్దార్ పాపన్న పోరాటం సబ్బండ కులాల పీడిత ప్రజలను సమీ కరించుకొని సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని.. గెరిల్లా పోరాటాలు చేస్తూ తన స్వస్థలం ఖిలాషాపూర్ రాజధానిగా పాలన సాగించాడన్నారు. ఆనాడే సబ్బండ కులాల ఐక్యత కు కృషి చేశాడన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటన్న గౌడ్ మాజీ వార్డ్ సభ్యులు తిరుపతయ్య గౌడ్ ,చక్రవర్తి గౌడ్, నరసింహా గౌడ్, జనార్దన్ గౌడ్, రాఘవేంద్ర గౌడ్ ,ఆనంద్ కృష్ణ గౌడ్, జీవన్ గౌడ్, లక్ష గౌడ్, గోపాల్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ ,దేవీ గౌడ్, నాటెల్లి కృష్ణయ్య గౌడ్ ,అప్పారాల మాజీ సర్పంచ్ గౌడ్ రవీందర్ గౌడ్ ,మోహన్ గౌడ్, రఘు గౌడ్ ,గంగాధర్ ముదిరాజ్ ,జాంగిర్, షకీల్, గున్ను మియా, గట్టన్న రమేష్ చారి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉద్యోగ 1104 యూనియన్ రీజినల్ ఎన్నికలు

రాజేంద్రనగర్, ఆగస్టు 18(నమస్తే ఉదయం) విద్యుత్ ఉద్యోగ 1104 సంఘం రీజినల్ ఎన్నికలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు సంఘం రాజేంద్రనగర్ డివిజన్ సెక్రటరీ అజీమ్ తెలిపారు. రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ పరిధిలోని షాదనగర్, కందుకూరు, రాజేంద్రనగర్ సర్కిల్ యూనిట్ , ఎం ఆర్ టి డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్మికులు ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.మంగళవారం ఉదయం 11:00 గంటలకు రాయల్ హయత్ కన్వెన్షన్, ఫిష్ బిల్డింగ్ దగ్గర, పీవీ నరసింహారావు ఫ్లై ఓవర్ (పిల్లర్ నం. 210)లో ఎన్నిక కార్యక్రమం జరుగుతుందన్నారు. రీజినల్ ఎలక్షన్స్ లో సభ్యులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాలు



శంషాబాద్, ఆగస్టు 18(నమస్తే ఉదయం) షాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు. సెక్షన్ పరిధిలోఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 13.00 గంటల వరకు శంకరాపురం విద్యుత్ ఫీడర్, జిమ్స్ విద్యుత్ ఫీడర్, ఐ ఎం టి విద్యుత్ ఫీడర్ పరిధిలలో వివిధ మరమ్మత్తుల కారణంగా కింది ప్రాంతాలలో శంకరాపురం, తొండుపల్లి, ఇందిరమ్మ కాలనీ,భగీరథ కాలనీ, సుభాసన గ్రీన్, ఓంకార్ క్యారియర్స్, కనక్ ఫ్యాక్టరీ, ఐ ఎం టి కళాశాల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



హీరో ధర్మ మహేష్( ఫైల్ ఫోటో)

## సినిమాల్లో హీరో.. రియల్ లైఫ్ విలన్

### అదనపు కట్నం కోసం భార్యపై వేధింపులు

### హీరో ధర్మ మహేష్ పై గచ్చిబౌలిలో కేసు నమోదు

శేరిలింగంపల్లి, ఆగష్టు 18( నమస్తే ఉదయం) సినిమాల్లో హీరో తన రియల్ లైఫ్ లో కట్టుకున్న భార్యకే విలన్ గా మారాడు. సినిమా అవకాశాలు పెరగడంతో జల్సాలు, షికార్లకు అలవాటు పడిన హీరో ధర్మ మహేష్ అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడంటూ అతని భార్య పోలీసులను ఆశ్రయించింది. దీంతో హీరో ధర్మా మహేష్ మీద గచ్చిబౌలి మహిళా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.సింధూరం డ్రింకర్ సాయి సినిమాలలో హీరోగా నటించిన ధర్మా మహేష్ అలియాస్ కాకాని ధర్మసత్య సాయి శ్రీనివాస మహేష్(30) మాదాపూర్ లోని ఫార్చ్యూన్ టవర్స్ లో నివాసం ఉంటున్నాడు. ధర్మ మహేష్ కు 2013లో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గౌతమి (31) తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారగా 2019లో వీరు వివాహం చేసుకున్నారు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. గౌతమి, ఆమె తండ్రి అందించిన ఆర్థిక సహకారంతో ఇద్దరు కలిసి ఓ హెూటల్ ఫ్రాంచైజీ వ్యాపారాన్ని సైతం ప్రారంభించారు. కాగా ఈ మధ్యకాలంలో సినిమా అవకాశాలు పెరగడంతో జల్సాలకు అలవాటు పడిన ధర్మా మహేష్, యువతులతో తిరుగుతూ భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. ప్రస్తుతం తన స్టేటస్ పెరిగిందని.. అదనపు కట్నం కావాలంటూ ధర్మా మహేష్, అతని కుటుంబ సభ్యులు వేధిస్తున్నాడు. గౌతమి డబ్బుతో ప్రారంభించిన హెూటల్ ఫ్రాంచైజీ ని సైతం తన పేరు మీదకు మార్చుకున్నాడు. ధర్మ మహేష్, అతని కుటుంబ సభ్యుల శారీరక, మానసిక వేధింపులకు విసిగిపోయిన భార్య గౌతమి పోలీసులను ఆశ్రయించింది. దీంతో గచ్చిబౌలి మహిళా పోలీస్ స్టేషన్ లో హీరో ధర్మా మహేష్ మీద బి.ఎన్.ఎస్ సెక్షన్ 85, 115(2), 316(2), 351(2), 352, సెక్షన్ 4 ఆఫ్ డిపి యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ధర్మ మహేష్ గతంలో సైతం వేధింపుల గురి చేయడంతో పోలీసులను ఆశ్రయించగా పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారని కానీ ధర్మా మహేష్ తీరు మారకపోవడంతో మరోసారి పోలీసులను ఆశ్రయించినట్లు గౌతమి తన ఫిర్యాదులో తెలిపింది.

## దుర్గానగర్ కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



దుర్గానగర్ చౌరస్తా వద్ద కాలువలో పడి ఓ వ్యక్తి దుర్మరణం

బుద్వేల్, ఆగస్టు 18(నమస్తే ఉదయం) గుర్తు తెలియని వ్యక్తి దుర్గానగర్ చౌరస్తా వద్ద గల కాలువ లో పడి మరణించాడు. మృతుని ఆచూకి తెలియ రాలేదు. ఒంటిపై బనియన్, డ్రాయర్ ఉంది. మృతుడు ప్రమాదవశాత్తు నీళ్లలో పడి మరణించాడా. మద్యం సేవించి నీళ్లల్లో పడ్డాడా తెలియాల్సి ఉంది. సమాచారం తెలుసుకున్న మైలార్ దేవుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసును మైలార్ దేవుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఈ నెల 19న విద్యుత్ 1104 అసోసియేషన్ సమావేశం



అజీమ్

రాజేంద్రనగర్, ఆగస్టు 18(నమస్తే ఉదయం) : ఈ నెల 19న ఉదయం 11 గంటలకు పిల్లర్ నెంబర్ 210 వద్ద గల రాయల్ హయత్ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ 1104 రాజేంద్రనగర్ సర్కిల్ సర్వ సభ్య సమాశాన్ని నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకుడు అజీమ్ తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ 1104 యూనియన్ నాయకులందరు సమావేశం కావాలన్నారు. రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ పరిధిలోని షాద్నగర్, కందుకూరు, రాజేంద్రనగర్ సర్కిల్ యూనిట్, ఎంఆర్టీ డివిజన్ అధ్యక్షులు. కార్యదర్శులు, కార్మిక సోదరి సోదరీమణులు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. త్వరలో జరుగనున్న ఎన్నికలలో కార్యచరణ ను సిద్ధం చేయడానికి ఈ సమావేశం లో చర్చించడం జరుగుతుందన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెస్టర్న్ సిడ్నీ యూనివర్శిటీల డ్యూయల్ డిగ్రీ కౌన్సిలింగ్ ప్రారంభం



డ్యూయల్ డిగ్రీ చేయడానికి సీటు వచ్చిన విద్యార్థినికి నియామక ఉత్తర్వులు అందచేస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ జీ ఈ సీ హెచ్ విద్యాసాగర్

బుద్వేల్, ఆగస్టు 18(నమస్తే ఉదయం) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, అస్ట్రేలియాకు చెందిన వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా అం దిస్తున్న బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చరల్ కోర్సు కు సంబిందించిన కౌన్సిలింగ్ సోమవారం ప్రారంభమైంది. రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం సహజ వనరులు, పర్యావరణ కేం ద్రం (సీ నేర్) ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ఈ కౌన్సిలింగ్ ప్రారంభమైంది. అక్షయ ప్రియ అనే అభ్యర్థికి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ విద్యాసాగర్ మొదటి సీటు కేటాయింపు పత్రాన్ని అందజేశారు. వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య చాలా దూరదృష్టితో ఆలోచించి ఈ ఏడాది నుంచి ఈ కోర్సును విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారని రిజిస్ట్రార్ తెలిపారు. విదేశీ విద్యను అందిపుచ్చుకునే ఈ మహోత్తర అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కౌన్సిలింగ్ కార్యక్రమంలో డీన్ ఆఫ్ అగ్రికల్చరల్ డాక్టర్ కె. ఝాన్సీరాణి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ కెబి ఈశ్వరీ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎం. మల్లారెడ్డి, విశ్వవిద్యాలయం మానవ వనరుల అభివృద్ధి కేంద్రం సంచాలకులు డాక్టర్ కె సురేశ్, పరీక్షల నియంత్రణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న పీ ఆర్ టి యు నాయకులు

## సీపీఎస్ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తు సెప్టెంబరు 1న చేపట్టనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలి

బుద్వేల్, ఆగస్టు 18(నమస్తే ఉదయం) : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ను రద్దు చేసి పాత పెన్షన్ విదానాన్ని అములు చేయాలని డిమాండ్ చేస్తు సెప్టెంబర్ ఒకటవ తేదీన నిర్వహించనున్న మహా ధర్నా ను. విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులందరు తరలిరావాలని పీఆర్టీయు రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ పిలుపు నిచ్చారు. ఇందిరా పార్కు వద్ద ఈ మహా ధర్నా ఉంటుందన్నారు. మహా ధర్నా కు సం బందించిన గోడ పత్రికను సోమవారం అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయు రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ సాగర్, నాయకులు రాజశేఖర్ గౌడ్, సత్తన్న, విజయ్ సాగర్, సాయి ప్రసాద్ రావు, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, సురేశ్, శమలమ్మ, రోజా రాణి, పద్మావతి, హేమలత, అనిత, రం గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సదరం క్యాంపులకు మీ సేవలో స్లాట్ బుకింగ్ చేసుకోవాలి...

జనగామ, ఆగష్టు 18 (నమస్తే ఉదయం): జిల్లా లో సదరం యు డి ఐ డి క్యాంపులలో పాల్గొనే దివ్యాంగులు ఈనెల 22 వ తేదీ నుండి మీ సేవలో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వసంత తెలిపారు.22వ తేదీ నుండి 29వ తేదీ వరకు లెప్రసీ, యాసిడ్ బాధితులు, వినికిడి లోపం ,కంటి చూపు కోల్పోయిన వారు, తల సేమియా, నరాల బలహీనత తదితర రుగ్మతలతో బాధపడుతున్న దివ్యాంగులకు 160 కొత్త స్లాట్లు కాగా 60 రెన్యువల్ ఉన్నాయని మొత్తంగా 220 ఉన్నట్లు తెలియజేశారు.స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి ఫోన్ నెంబర్ కి మెసేజ్ రావడం జరుగుతుందని మెసేజ్ వచ్చిన తేదీలలో ప్రభుత్వ ఆసుపత్రి లోని యూ డి ఐ డి సదరం క్యాంపు హాజరుకావాలని తెలిపారు ఇతర వివరాలకు కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 8008202287 ను సంప్రదించాలన్నారు.

## దొడ్డి కొమురయ్య స్మారక భవనం కోసం స్థలం పరిశీలన



జనగామ,ఆగష్టు 18 ( నమస్తే ఉదయం):జనగామ జిల్లా కేంద్ర లో తెలంగాణ ప్రజల సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య స్మారక భవనం, కురుమల సంప్రదాయ ఒగ్గు కళా క్షేత్రం నిర్మాణం కోసం సోమవారం రెవెన్యూ శాఖ అధికారులు, కురుమ సంఘం నాయకులు చంపక్ హిల్స్ లో స్థలం పరిశీలిన చేసారు. ఈ కార్యక్రమం లో జనగామ జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు కంచ రాములు,కురుమ సంఘం జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ మల్లేష్, కురుమ సంఘం జనగామ పట్టణ అధ్యక్షులు కార్యదర్శులు బాల్దే మల్లేశం, జూకంటి శ్రీశైలం, జనగామ పట్టణ పెద్ద కురుమ మోటే లింగయ్య, జనగామ కోపా గౌరవ అధ్యక్షులు కర్రె కృష్ణ, కోపా కోశాధికారి ఎండ్రు వైకుంఠం ,జనగాం మండల కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సర్వాయి పాపన్న వారసున్ని

# నేను ఎవరికి తలవంచను

**డాలర్ ఝాన్సీరెడ్డి జీతగాన్ని కాదు**
**కరడుగట్టిన కాంగ్రెస్ పార్టీ సేవకుడిని**
**-యశస్విని రెడ్డి గెలుపులో**
**కీలక పాత్ర పోషించిన**
**-కష్టపడ్డోళ్ళకు గుర్తింపు లేదు..**
**అమ్ముడుపోయి వచ్చినోళ్లదే పెత్తనం**
**-నాకు సంపాదన కాదు**
**నమ్ముకున్న ప్రజలే ముఖ్యం**
**పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ సీనియర్**
**నాయకుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్**


విలేకరుల సమావేశం లో మాట్లాడుతున్నా కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పెద్ది కృష్ణ మూర్తి గౌడ్

జనగామ, ఆగస్టు18 ( నమస్తే ఉదయం): ప్రజాసేవ ముసుగులో అమెరికా నుంచి వచ్చిన డాలర్ ఝాన్సీరెడ్డి జీతగాన్ని కాదని కరడుగట్టిన కాంగ్రెస్ పార్టీ సేవకుడినని పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, దేవరుప్పుల మండలం మాజీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్ అన్నారు. సోమవారం దేవరుప్పుల మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గెలుపులో కీలకపాత్ర పోషించామని కష్టపడ్డోళ్ళకు పార్టీలో గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుర్తి పోరాటాల పురిటి గడ్డ అని తాను బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న వారసుడినని ఎవరికి తలవంచే ప్రసక్తే లేదన్నారు.

అధిష్ఠానం కాంగ్రెస్ పార్టీ వేరు, పాలకుర్తిలో కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న కమర్షియల్ రాజకీయాలకు చాలా తేడా ఉందని ఎద్దేవా చేశారు. వాన కొండయ్య గుట్ట అభివృద్ధి కోసం రూ.1 కోటి మంజూరు చేయించడం సంతోషించదగిన విషయమే అయినప్పటికీ దాని వెనుక ఉన్న మైనింగ్ ను నిలిపి వేయకపోతే ప్రజలకు ప్రమాదం వాటిల్లుతుందని ప్రశ్నించినందుకే కాంట్రాక్టర్ తో లోపాయికర ఒప్పందాలు చేసుకొని తనకు రూ.1కోటి 20 లక్షల పరువు నష్టం దావవేసి జరిమానా కట్టాలని నోటీసులు పంపించి తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని ఆరోపణలు సంధించారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఇసుక దందా జరుగుతుంటే పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. లబ్దే కావాలనుకుంటే పక్క పార్టీల దగ్గర చెయ్యి చాపడం ఎంతసేపని నన్ను నమ్ముకున్న ప్రజలే నాకు ముఖ్యమని సంపాదన కాదని స్పష్టం చేశారు. నమ్ముకున్న ప్రజల విశ్వాసాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని తెలిపారు.

డాలర్లపై ఆశతో చిల్లరకు అమ్ముడుపోయి వచ్చిన వాళ్లదే ప్రస్తుతం పెత్తనం కొనసాగుతుందని ఆరోపించారు. అధిష్టానం ఆదేశిస్తే పార్టీలో కొనసాగుతానని తెలిపారు. లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులను పోటీ చేయించి గెలిపించుకుంటానని దమ్ముంటే ఆపాలని సవాల్ విసిరారు. ఝాన్సీరెడ్డి దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయ్యే విధంగా త్వరలోనే భారీ బహిరంగ సభను నిర్వహించి తన సత్తా ఏమిటో నిరూపిస్తానని కీలక ప్రకటన చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్, ప్రకాష్, మాసంపెల్లి మహేందర్, జేరిపోతుల కిష్టయ్య,పెద్ది రమేష్, సుడిగెల మహేష్, అనిల్ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల

**- పెచ్చులూడుతున్న పాఠశాలల పైకప్పులు**
**- భయాందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు**
**- పట్టించుకోని విద్యాశాఖాధికారులు**



ధరూర్, ఆగస్టు18(నమస్తే ఉదయం) ప్రభుత్వం పాఠశాలల భవనాలతో పాటు విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోంది. ప్రతీ యేటా విద్యా సంవత్సరం ఆరంభంలో ఆయా పాఠశాలల భవనాల మరమ్మతులకు, ఇతరత్రా పనుల నిమిత్తం నిధులను విడుదల చేస్తోంది. కానీ విద్యాశాఖ అధికారుల అలసత్వం కారణంగా ప్రభుత్వ ఆశయానికి గండిపడుతోంది. ధరూర్ మండలంలోని ద్యాగదొడ్డి ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలంలో వర్షపు నీరు పై కప్పు నుంచి రావడంతో భవన నిర్మాణం దెబ్బతింటోంది. అక్కడక్కడ సజ్జలు కూడా పెచ్చులూడుతూ దర్శనమిస్తున్నాయి. చలికాలం, ఎండాకాలం పరిస్థితులు కాస్త మెరుగ్గా ఉన్నా, వర్షాకాలంలో మాత్రం విద్యార్థులు ఇబ్బందులు పడక తప్పడంలేదు. ప్రాథమిక పాఠశాల లీకేజి సమస్యలు నెలకొన్న విద్యాశాఖాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. పాఠశాల మరమ్మతులకు నోచుకోకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రాథమిక పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## 13 మండలాల్లో వర్షపాతం నమోదు

గద్వాల ప్రతినిధి, ఆగస్టు 18(నమస్తే ఉదయం)జిల్లాలోని 13 మండలాల్లో ఆదివారం నుంచి సోమవారం నాటికి 505.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలియచేశారు. అత్యధికంగా రాజోలి మండలంలో 52.1 మి.మీ వర్షం పడగా, వడ్డేపల్లిలో 24.1, కేటిదొడ్డిలో 29.6, ధరూర్ లో 35.1, గద్వాలలో 35.0, ఇటిక్యాల 43.5, మల్దకల్ 40.3, గట్టు 47.5, అయిజ 48.7, మానవపాడులో 34.2, ఉండవెల్లిలో 39.5, అలంపూర్ లో 39.0, ఎర్రవల్లి మండలంలో 36.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

## కలెక్టరేట్‌లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను**
**భావితరాలకు తెలిసేలా కృషి చేయాలి**
**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జిల్లా కలెక్టరేట్ లో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

జనగామ, ఆగష్టు 18 ( నమస్తే ఉదయం): బహుజన నాయకుడు, పోరాట యోధుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుబడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను భావితరాలకు తెలిసేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు.సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫెరెన్స్ హాల్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవాలను బి.సి.సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ విచ్చేసి బి.సి.అధికారులు, బి.సి.కులసంఘాలు, ఇతర కులసంఘ నాయకులతో కలిసి సర్దార్ పాపన్న చిత్రపటానికి పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జనగామ జిల్లా కవులు, కళాకారులకు నిలయమని, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్ర రచించి భావితరాలకు పుస్తక రూపంలో అందించాలన్నారు.అణగారిన వర్గాల, శ్రమజీవుల కష్టాన్ని దోచుకునే వారిని ఎదిరించి పోరాడి సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం తపించిన మహనీయుడని కొనియాడారు. చైతన్యానికి స్ఫూర్తి నిచ్చిన పోరాట యోధుని గాథలు ప్రతి ఒక్కరికి తెలియలన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు సంఘాలన్నీ ఒక్క తాటిపై నిలిచి ఏర్పాటు చేయాలన్నారు.జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టేందుకు ప్రతిపాదనలు అందించాలన్నారు.ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల్లో భాగంగా గౌడ లబ్ధిదారులకు కాటమయ్య కిట్ లను అందిస్తున్నామని, సామాజిక బాధ్యత గా గుర్తించి దాతలు ముందుకు రావాలన్నారు.జనగామ పట్టణ ముఖద్వారమైన హైదరాబాద్ రోడ్ లో సర్దార్ సర్వాయి పాపన్న తో పాటు బడుగు బలహీన వర్గాల కు అండగా నిలిచిన దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ పోరాట యోధుల చరిత్ర తెలిసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి రవీందర్, ఎక్సైజ్ శాఖ అధికారి అనిత, బిసి కుల సంఘ ప్రతినిధులు ఇతర కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి 40 ఫిర్యాదులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18(నమస్తే ఉదయం) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 40 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: తహసీల్దార్ హరికృష్ణ



కేటిదొడ్డి, ఆగస్టు18 ( నమస్తే ఉదయం)ఋతుపవనాలకు తోడు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఏకధాటిగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేటిదొడ్డి తహసీల్దార్ హరికృష్ణ సూచించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయా గ్రామాలలో రెవెన్యూ అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. మట్టితో కట్టిన ఇండ్లు, పాత నివాసాల్లో ఉన్న వారిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.ఇనుప విద్యుత్ స్తంభాలను తాకకుండా జాగ్రత్త పడే విధంగా అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లోని వర్షాల వల్ల కలిగే నష్టాలను ఎప్పటికప్పుడు సమాచారం అందించాల్సిందిగా ఆదేశించారు. రానున్న రెండు రోజులు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సమాచారం మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## ఎడతెరిపి లేని వాన.. అలుగు పారుతున్న చెరువులు

కేటిదొడ్డి, ఆగస్టు18 (నమస్తే ఉదయం)అల్పపీడనం ప్రభావంతో కేటిదొడ్డి మండలంలో 29.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఆయా గ్రామాలలో వాగులోకి వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో కేటిదొడ్డి మండలంలో పలు గ్రామాలలో పల్లపు ప్రాంతంలో ఉన్న ఇళ్ల మధ్య వరద నీరు నిలిచింది. పత్తి చేను, వరి పొలాల్లో వరద నీరు చేరడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అనేక ప్రాంతాలలో రైతులు సాగు చేసిన పత్తి చేలు వర్షపు నీటిలో మునిగిపోయాయి. అదేవిధంగా మిరప, తదితర పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి, పంట నష్టాలను అంచనావేసి ప్రభుత్వం తమను ఆదుకునేలా కృషి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.




పటేల్ గూడెం క్రాస్ లో ఉన్న బ్రిడ్జ్ పైన రోడ్డు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ వినతి పత్రం ఇస్తున్న బిసి సంఘం నాయకులు

## పటేల్ గూడెం బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలి

జనగామ, ఆగష్టు 18 (నమస్తే ఉదయం): జనగాం - పాలకుర్తి రహదారిలో ఉన్న పటేల్ గూడెం వాగు వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పెండింగ్ ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని,బీసీ సంక్షేమ సంఘం జనగాం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా వాణి లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కు వినతిపత్రం ఇచ్చారు. దాదాపు 20 రోజుల నుండి ఆర్టిసి బస్సులు నడవక కుందారం, కిష్టగూడెం ,చిటూరు గ్రామాల ప్రజలు, ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు , తక్షణమే నిర్మాణ పనులు చేపట్టి బస్ సర్వీస్ నడిపే విధంగా చూడాలని ఆ వినతిపత్రం లో కలెక్టర్ విన్నవించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్ర వీరస్వామి , తీన్మార్ మల్లన్న బీసీ పొలిటికల్ జేఏసీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి గాడి పెళ్లి యాకన్న ,అమృతం వినయ్ కుమార్, గుగ్గిళ్ళ సోమరాజు , మెహరాజ్, తదితరులు పాల్గొన్నారు

## గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి



గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు18(నమస్తే ఉదయం) జిల్లా గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులతోపాటు విద్యార్థి సంఘాల నాయకులు పల్లయ్య, రంగస్వామి, తదితరులు సోమవారం గ్రంథాలయ కార్యదర్శి మనోజ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు సరైన వసతులు లేవు అని, టాయిలెట్స్ లేవు అని,గతంలో గ్రంథాలయానికి కేటాయించిన టాయిలెట్స్ కూడా సరిగా శుభ్రం చేయకపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రంథాలయంలో వసతులు కల్పించి, టాయిలెట్స్ సమస్య పరిష్కరిస్తామని గ్రంథాలు సెక్రటరీ మనోజ్ కుమార్ తెలిపారు.


పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డి జన్మదిన వేడుకలు

## ఘనంగా హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

జనగామ, ఆగష్టు 18 (నమస్తే ఉదయం): జిల్లా లోని పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధి కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా ఉన్న పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఈ రోజు పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమిష్టిగా నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు కలిసి ఝాన్సీ రాజేందర్ రెడ్డి తో కేక్ కట్ చేయించి, హర్షధ్వానాల మధ్య జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో శుభాకాంక్షలు తెలపడానికి ప్రజలు భారీ ఎత్తున హాజరయ్యారు. హాజరైన వారంతా శాలువాలతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పలు సంఘాలు, సమితుల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, తన అత్త హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని, పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తారని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలంతా ఆమెకు ఆశీస్సులు అందించాలని కోరారు. పాలకుర్తి అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఝాన్సీ రాజేందర్ రెడ్డి మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని స్పష్టం చేశారు.

## మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18(నమస్తే ఉదయం)మద్యం సేవించి వాహనాలు నడపరాదని గద్వాల ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలలో పోలీసు సిబ్బందితో కలిసి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. రోడ్డుపై వచ్చిపోయే వాహనాల డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు నిర్వహించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ,ఇన్సురెన్స్, తదితర ధృవపత్రాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంటుందని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుందని అన్నారు.

## ఇచ్చిన హామీలను అమలు చేయడం చేత కాకపోతే

# ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి

**పద్మశ్రీ మందకృష్ణ మాదిగ.**

**కాళ్లు చేతులు లేనోళ్ల పెన్షన్ ఎగగొడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం**

**పెంచుతామన్న పెన్షన్లు ప్రభుత్వం పెంచదు... ప్రతిపక్షం అడగదు.**

**సెప్టెంబర్ 9 లోపు పెన్షన్లు పెంచకపోతే లక్షలాదిమంది వికలాంగులతో మహా గర్జన నిర్వహించి ప్రభుత్వ మెడలు వంచుతాం.**

**పద్మశ్రీ మందకృష్ణ మాదిగ**

నమస్తే ఉదయం బ్యూరో : ఆగస్టు 18 ( నమస్తే ఉదయం) ఎన్నికల ముందు పెన్షన్ దారులకు పెన్షన్లు పెంచుతామని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ఇచ్చినామీలను అమలు చేయడం చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పట్టణంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వికలాంగుల సమావేశంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. వికలాంగుల పెన్షన్ 4000 నుండి 6000 కు, వృద్ధులు, వితంతువుల చేయూత పెన్షన్ 2016 నుండి 4000 వరకు, కండరాల క్షీనత రోగులకు, ఇతర తీవ్రమైన



పద్మశ్రీ మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న రాచమల్ల దాసు.

రోగులకు 15000 కి ఆంధ్రప్రదేశ్ లో లాగా పెంచి, తెలంగాణ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. పెన్షన్ పెంచుతామని రాష్ట్రంలో గద్దెనెక్కి 21 నెలలు గడుస్తున్న పెంచుతామన్న పెన్షన్ పెంచకుండా నమ్మకద్రోహం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పెన్షన్ దారుల శక్తి ఏంటో చూపించేందుకె సెప్టెంబర్



వికలాంగుల సమావేశంలో మాట్లాడుతున్న పద్మశ్రీ మందకృష్ణ మాదిగ

9న లక్షలాది మందితో పరేడ్ గ్రౌండ్లో పెన్షన్ దారుల మహాగర్జన నిర్వహిస్తున్నామని, అర్హత ఉన్న పెన్షన్దారులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంగ్లాలో పుట్టాడు, కేసీఆర్ గడిలో పుట్టాడు కాబట్టి వాళ్లకు పేదల బాధలు పట్టవు, నేను పూరి గుడిసెలో పుట్టాను, పేదల బాధలు నాకు తెలుసు కాబట్టే పెన్షన్ పెంచాలని పేదల కోసం రాష్ట్రం మొత్తం తిరుగుతున్నానని పేర్కొన్నారు. పక్క రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేయూత పెన్షన్ 4 వేలు, వికలాంగుల పెన్షన్ 6 వేలు ఇస్తుంటే, రేవంత్ రెడ్డి మాత్రం ఇస్తానన్న పెన్షన్ ఇవ్వకుండా నెలకు వచ్చే పెన్షన్ 2 వేల చొప్పున లెక్కేసిన నెలకు వెయ్యి కోట్లతో 21 నెలలుగా 21వేల కోట్ల రూపాయల డబ్బుల్ని వారికి ఖర్చు చేయకుండా దగా చేశారని మండిపడ్డారు . పెన్షన్ మీదనే ఆధారపడి జీవించే ప్రజల్ని గాలికి వదిలేసి పాలన చేసే ముఖ్యమంత్రికి పేదల గోస పట్టదా..? అని ప్రశ్నించారు. పెన్షన్ పై ఇచ్చిన హామీ ప్రకారం మాట నిలబెట్టుకో.. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాకపోతే రాజీనామా చేసి ఇంట్లో కూర్చో అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పేద వర్గాల పెన్షన్ ను పెంచని ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించకుండా ప్రతిపక్ష పార్టీలు కూడా అన్యాయం చేస్తున్నారని, అనేక అంశాల మీద ప్రభుత్వాన్ని ప్రశ్నించే పార్టీలకు ఈ కాళ్లు లేనోళ్ల, ముసలోళ్ళ సమస్యల మీద ఒక నిమిషం మాట్లాడే తీరిక లేదా అని ప్రశ్నించారు.. ఇప్పటికైనా ప్రతిపక్ష, విపక్ష పార్టీల మౌనం వీడాలని కోరారు.

### 200 ల పెన్షన్ 2000 ఊరికే రాలేదు.

గతంలో 200 ఇస్తున్న పెన్షన్ 2 వేలకు పెరిగిందంటే... మరోవైపు వికలాంగులకు 4 వేలు వస్తున్నాయంటే ఆది పాలకుల దయదక్షణ్యాల వల్ల కాదు, పార్టీల వల్లనో కాదు, పెన్షన్ పెంపు కోసం 13 ఏండ్ల కింద పాలకుల మెడలు వంచేలా లక్షలాది మందితో సభ పెట్టీ కొట్లాట చేస్తానే పెన్షన్ పెరిగిందని మందకృష్ణ మాదిగ గుర్తు చేశారు. భూస్వాములకు రైతు భరోసాకు, అభివృద్ధి పేరుతో వేల కోట్ల ఖర్చు పెడుతున్నప్పుడు, కాళ్ళు, కళ్ళు, మాట్లాడలేని వికలాంగులకు, వయసు మీద పడిన వృద్ధులకు, భర్త లేకుండా బిడ్డలను పోషించే శక్తీ లేని వితంతువులకు, తీవ్రమైన రోగాలతో చావుతో సావాసం చేస్తున్న కండరాల, రక్త హీనత తదితర రోగులకు ఎందుకు పెన్షన్ పెంచడం లేదని ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచకుండ ఎందుకు అన్యాయం చేస్తున్నావో సమాజానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### సెప్టెంబర్ 9 డెడ్ లైన్.

వికలాంగులకు ఇచ్చిన హామీల నిలబెట్టుకునేందుకు సెప్టెంబర్ 9 డెడ్లైన్ అని, సెప్టెంబర్ 9 లోపు పెన్షన్ పెంపుతో పాటు ఇతర డిమాండ్స్ తీర్చకపోతే, రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలించే అర్హత లేదని అన్నారు. సెప్టెంబర్ 9న లక్షలాది మందితో పరేడ్ గ్రౌండ్లో పెన్షన్ దారుల మహాగర్జన మహాసభ నిర్వహించి ఈ ప్రభుత్వాన్ని కుప్పకూలుస్తామని, పింఛన్దారుల శక్తి ఏందో ప్రభుత్వానికి చూపిస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ పోరాటం తో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆరోగ్య శ్రీ, వికలాంగుల, వృద్ధుల, వితంతువుల పెన్షన్ 200 నుండి



సమావేశానికి భారీగా హాజరైన వికలాంగులు.

1000, 1500, 2000 సాధించుకొని ఆంధ్రప్రదేశ్ లోనేడు 6000 సాధించడం జరిగిందని, ఆ స్ఫూర్తి తో తెలంగాణా లో కూడా పెన్షన్ 6000 కు, ఇతర డిమాండ్స్ సాధించేవరకు విశ్రమించే ప్రసక్తేలేదని వాపోయారు . ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ, సీనియర్ నాయకులు రాచమల్ల దాసు , ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పెంటనోల్ల నరసింహ మాదిగ, ఎమ్మార్పీఎస్ శంషాబాద్ ఇంచార్జి కొత్తూరు రమేష్ మాదిగ, అధ్యక్షులు చెన్నగండు భాస్కర్ మాదిగ, ఎం ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాని భాను ప్రసాద్ మాదిగ, ఎంఎస్ఎఫ్ శంషాబాద్ నాయకులు పాల మహేశ్ మాదిగ, రాష్ట్ర బాధ్యులు రత్నం, పెన్షన్ దారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



టిఎల్ఎం మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం.

## టిఎల్ఎం మెటీరియల్‌తోనే అర్ధవంతమైన విద్యా బోధన

**ఎమ్మెల్యే వేముల వీరేశం**

నకిరేకల్,ఆగస్టు18,(నమస్తే ఉదయం): నల్గొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎఫ్ ఎల్ ఎన్-టి ఎల్ ఎం మేళా వహించారు ఈ మేళాను నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ప్రారంభించారు. ఉపాధ్యాయులు తయారుచేసిన మెటీరియల్ వస్తువులను ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బోధన అభ్యాస సామాగ్రి ఉపయోగించడం ద్వారా విద్యార్థులకు అర్ధవంతమైన బోధన అందించ వచ్చని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు మేళాను నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. విద్యార్థులకు కూడా మెటీరియల్ ఎలా తయారు చేయాలో నేర్పించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపాలిటీ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి మేక నాగయ్య, నాయకులు చామల శ్రీనివాస్, లింగాల వెంకన్న, పన్నాల రాఘవరెడ్డి, కౌన్సిలర్స్ యాసారపు, వెంకన్న, శ్రీకాంత్, జడ్పీహెచ్ఎస్ ప్రధాన ఉపాధ్యాయులు రాములు తదితరులు పాల్గొన్నారు.



టిఎల్ఎం మెటీరియల్ ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే.

## పద్మశ్రీ మంద కృష్ణ మాదిగను సన్మానించిన రాచమల్ల దాసు






పద్మశ్రీ మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న రాజమల్ల దాసు.

శంషాబాద్, ఆగస్టు 18 ( నమస్తే ఉదయం ) ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, వికలాంగుల సంక్షేమం కోసం పోరాటం చేస్తున్న నిరంతర పోరాట యోధులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సీనియర్ కాంగ్రెస్ వాది రాచమల్ల దాసు ఘనంగా సన్మానించారు. శంషాబాద్ లో నిర్వహించిన వికలాంగుల సమావేశంలో పాల్గొన్న పద్మశ్రీ మందకృష్ణ మాదిగను శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. 30 ఏళ్లుగా మా జాతి కోసం చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ఇవ్వడం అభినందనీయమని రాచమల్ల దాసు అన్నారు.

## గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

**రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 (నమస్తే ఉదయం) ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు అన్నారు.సోమవారం రాచకొండ పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు కమిషనర్ సుధీర్ బాబు రంగారెడ్డి, మేడ్చల్, భువనగిరి జిల్లాలకు సంబంధించి గణేష్ ఉత్సవాలు నిర్వాహణ పై అదనపు కలెక్టర్లు, డిసిపిలు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్, వాటర్ వర్క్స్, భాగ్యనగర గణేష్ ఉత్సవ కమిటీ వారితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ నెల 27వ తేది నుండి సెప్టెంబర్ 6వ తేది వరకు నిర్వహించే గణేష్ ఉత్సవాలు ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. మండపాల ఏర్పాటు నిబంధనలకు లోబడి ఏర్పాటు చేయాలని తెలిపారు. మండపాల వద్ద ఎటువంటి విద్యుత్, అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. నిమజ్జనం చేసే సమయంలో చెరువుల వద్ద లైటింగ్, క్రేన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, శానిటేషన్ చేపట్టి పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడటం జరుగుతుంది అని తెలిపారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం అని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నుండి పాల్గొన్న ఇంచార్జి అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో గణేష్ ఉత్సవాలు శాంతి భద్రతల మధ్య శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో భువనగిరి అదనపు కలెక్టర్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి, విద్యుత్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్ అండ్ బి, వాటర్ వర్క్స్, పోలీసు అధికారులు, భాగ్యనగర గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## వర్షాకాలం దృష్ట్యా ట్రాన్స్ మిషన్ అధికారులతో ఎండీ సమీక్ష

ఖైరతాబాద్, ఆగస్టు 18 (నమస్తే ఉదయం) జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సోమవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఈడీ మయాంక్ మిట్టల్ లతో నగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న కృష్ణా, గోదావరి, మంజీరాలతో ఇతర తాగునీటి ప్రాజెక్టులపై ఓ అండ్ ఎమ్, ట్రాన్స్‌మిషన్, క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ... వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున మంచినీరు కలుషితం కాకుండా ఓ అండ్ ఎమ్, ట్రాన్స్‌మిషన్ అధికారులు జాగ్రత్త పడాలని ఎండీ సూచించారు. వర్షాల వల్ల తాగునీటిలో టర్బిడిటీ పెరిగే అవకాశం ఉన్నందున తాగునీటి నాణ్యతపై జలమండలి ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. అలాగే ట్రాన్స్ మిషన్, ట్రీట్ మెంట్ ప్లాంట్స్, వాటర్ క్వాలిటీ, క్లోరినేషన్ వివరాలపై ఎండీ అశోక్ రెడ్డి అధికారులతో చర్చించారు.అలాగే క్వాలిటీ కంట్రోల్ విభాగం అన్ని సెక్షన్లలో మంచినీటి నమూనాలను సేకరించి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. రెట్టింపు సంఖ్యలో శాంపిల్లు సేకరించి పరీక్షించిన తర్వాత సరఫరా చేయాలన్నారు. అలాగే బస్తీ ప్రాంతాల్లో కలుషిత మంచినీరు రాకుండా ఎలాంటి జాగ్రత్త చర్యలు చేపట్టారో, వస్తే ఎలా పరిష్కరిస్తారో ఎండీ అధికారులను అడిగి తెలుసుకున్నారు.అన్ని విభాగాల అధికారులు సమిష్టిగామంచినీటి నాణ్యత మీద దృష్టి సారించాలని సూచించారు. అలాగే వర్షకాలం కాబట్టి సీజనల్ వ్యాధులు రాకుండా, మురికి వాడల్లో క్లోరిన్ మాత్రలను పంపిణీ చేయాలని ఎండీ అధికారులకు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.పంపుహౌజ్ ల మోటార్లు పంపు చేసే క్వాంటిటీకి సంబంధించిన లాగ్ బుక్ లు, పంపుల రిపేర్లు, నిర్వహణ పూర్తి వివరాల రికార్డులు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి పంపుహౌజ్ లలో స్టాండ్ బై మోటార్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ట్రాన్స్ మిషన్ సీజీఎం బ్రిజేష్, జీఎంలు, డీజీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## హిమాయత్ నగర్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా కట్టమీద శ్రీను



మొయినాబాద్, ఆగస్టు 18 (నమస్తే ఉదయం) మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా కట్టమీద శ్రీను ఎన్నికయ్యారు ఆదివారం మధ్యాహ్నం నుంచి మొదలైన ఎన్నిక రాత్రి హెూరా కోరిక జరిగింది. సాయంత్రం ఎన్నికలు లెక్కించి సరికి సమీప ప్రత్యర్థి కుశంగల నవీన్ కుమార్ పై ఐదు ఓట్ల తేడాతో శీను గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా షాబాద్ సాయికుమార్ సమీప ప్రత్యర్థి దారుపల్లి రాజేందర్ పై విజయం సాధించారు. జనరల్ సెక్రటరీగా పైలు శ్రీధర్ జాయింట్ సెక్రటరీగా కట్టమీద అనిల్ కుమార్, కోశాధికారిగా రెడ్డిపల్లి రోహిణి ఉపవాసాధికారిగా కట్టమీద శ్రీకాంత్, క్రీడా అధికారిగా మల్లెపల్లి ప్రవీణ్ కుమార్, ఉప క్రీడా అధికారిగా షాబాద్ శ్రావణ్ ఎన్నికయ్యారు. ఎన్నికలకు గ్రామ మాజీ ఉపసర్పంచ్ , నాయకులు జ్యోతి ప్రకాష్ , మాల యాదయ్య హాజరై యువకులు అభివృద్ధిలో పాలు పంచుకొని పోటీ తత్వంలో ముందుకెళ్లాలని సూచించారు .గ్రామ అభివృద్ధి చెందినప్పుడే మండల జిల్లాలో అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఎన్నికలలో ఓడిపోయామని నిరాశ చెందకుండా గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రభుత్వాలు అంబేద్కర్ ఆశయాన్ని నెరవేర్చకు వివిధ పథకాల్లో రూపొందిస్తున్నాయని వాటిని సద్వినియోగపరుచుకునేలా ఎన్నికైన వారు వారికి తోడ్పడాలని సూచించారు.

## క్రమశిక్షణ, నాయకత్వంతో ముందుకు పోవాలి

**కెప్టెన్ ఎల్. పాండు రంగారెడ్డి**



మొయినాబాద్, ఆగస్టు 18, (నమస్తే ఉదయం) మొయినాబాద్‌లోని గ్లోబల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్), 20వ బ్యాచ్ ఫ్రెషర్ ఇంజనీరింగ్ విద్యార్థులను స్వాగతించడానికి సోమవారం తన ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించింది. విద్యార్థులను విద్యా వాతావరణం, సంస్థాగత విలువలు , క్యాంపస్ సంస్కృతితో పరిచయం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా జరిగింది. ముఖ్య అతిథి కెప్టెన్ ఎల్. పాండు రంగారెడ్డి తన ప్రసంగంలో, విజయవంతమైన కెరీర్‌లను నిర్మించడంలో క్రమశిక్షణ, నాయకత్వం , నిరంతర అభ్యాసం కీలకమైన అంశాలు అని నొక్కి చెప్పారు. గౌరవ అతిథిగా హాజరైన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ సబ్-ఇన్‌స్పెక్టర్ జబీనా మాట్లాడుతూ... విద్యార్థులు పౌర బాధ్యతను నిలబెట్టుకోవాలని, ర్యాగింగ్ పట్ల సున్నా సహనాన్ని కొనసాగించాలని, మహిళల భద్రతను నిర్ధారించాలని, మాదకద్రవ్యాలు , మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్టపరమైన పరిణామాలను నొక్కి చెప్పారు.కార్యదర్శి సబిహా ఫర్జానా, డైరెక్టర్లు కె. ఎం. ఫసిహుద్దీన్, మరియా తబస్సుమ్, డీన్ డాక్టర్ రవీంద్ర తివారీ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాజా రావు , ఇతర ప్రముఖులు విద్యార్థులను అభినందించారు మరియు సంస్థలోని అవకాశాలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని ప్రోత్సహించారు. కార్యక్రమం ధన్యవాదాలతో ముగిసింది, కొత్త బ్యాచ్ కోసం ఒక ఉత్సాహభరితమైన విద్యా ప్రయాణానికి నాంది పలికింది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733